జాతీయ దిన పత్రిక

తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 65 17-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఉన్నారు

- అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఉన్నారు: పవన్

2లో

ఎల్‌పీజీ సంక్షోభంపై రాజ్యసభలో రచ్చ

- ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ధ్వజం
- ఖర్గేపై ఎదురుదాడికి దిగిన జేపీ నడ్డా

ముస్లింలకు అండగా ఉంటాం

- వక్ఫ్ ఆస్తులను కాపాడుతాం
- 21 నెలల్లో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అందించాం
- బెజవాడ నుంచే హజ్ యాత్రకు
- ఇఫ్తార్ విందులో చంద్రబాబు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ

విజయవాడ,:ముస్లింలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇమామ్, మౌజన్‌లకు ఇచ్చే గౌరవ వేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. రాజధాని అమరావతిలో నూతనంగా 'హజ్ హౌస్' నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత 21 మాసాల్లో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. శనివారం విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సీఎం పాల్గొన్నారు. తొలుత ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను త్వరలో పూర్తిచేసి

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ముందడుగు

- ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా గుర్తింపు తెచ్చేందుకు సర్కారు కృషి
- అందుకే తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్‌కు శ్రీకారం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- ప్రజా భాగస్వామ్యంతో భవిష్యత్ తెలంగాణ నిర్మాణం
- క్యూర్, ప్యూర్, రేర్‌తో వికేంద్రీకృత వ్యూహం అమలు

హైదరాబాద్: 'దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ దిశగా బలమైన పునాదులు వేసేందుకు ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. ఇదే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్2047 విజన్‌కు శ్రీకారం చుట్టింది. దేశ పురోగతిలో ప్రధాన భూమిక పోషించే స్థాయికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పెరిగేలా చర్యలు చేపట్టింది..'అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా చెప్పారు. రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణాలు అర్పించిన వారి త్యా గాలను స్మరిస్తూ, వారిని గౌరవిస్తూ ప్రభుత్వం ప్ర జా పాలన స్ఫూర్తిని కొనసాగిస్తోంది. అమలు చేసే ప్రతి పథకం, ప్రతి విధానం, ప్రతి కార్యాచరణలో ప్రజల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక సమానత్వాన్ని ప్రభుత్వం పాటిస్తుందని విశ్వసిస్తున్నా.

చంద్రబాబు కోసమే సునీత ఆరాటం

- ఆధారాలతో సహా నిలదీసిన వైఎస్ అవినాష్‌రెడ్డి
- వివేకా లేఖను బయట పెట్టకపోవడం నేరం కాదా?
- హంతకుడు దస్తగిరి బెయిల్ రద్దుకు ఎందుకు పట్టుబట్టడం లేదు?
- హత్య చేసిన వాడికి అండగా నిలబడతారా?
- ఎందుకని చంద్రబాబుకు, దస్తగిరికి, సునీతకు లూథ్రా ఒక్కడే న్యాయవాది?

న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలను పక్కదోవ పట్టించి, చంద్రబాబుకు రాజకీయ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా విచారణ సాగుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కేసులో సునీత అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని, సీబీఐ విచారణలో ఉన్న లొసుగులను ఆధారాలతో సహా ఎండగట్టారు. 'హత్య చేశానని ఒప్పుకున్న

2లో

ఇరాన్‌పై బాంబుల వర్షం

- డ్రోన్ ఫ్యాక్టరీలే లక్ష్యంగా దాడులు
- దెబ్బతిన్న ఇరాన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్లినిక్
- తీవ్రస్థాయిలో ఇరాన్ ప్రతీకార దాడులు
- అధునాతన సెజ్జిల్ క్షిపణుల ప్రయోగం
- యూఏఈలో పారిశ్రామిక జోన్‌పై దాడి

దుబాయ్:పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. ఇజ్రాయెల్‌అమెరికా సోమవారం కూడా ఇరాన్‌పై భారీగా దాడులు కొనసాగించాయి. రాజధాని టెహ్రాన్‌తో పాటు ఇస్ఫహాన్ తదితర నగరాలపై ఎడతెరిపి లేకుండా క్షిపణులు, బాంబుల వర్షం కురిపించాయి. వందలాది లక్ష్యాలపై

అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

- అసెంబ్లీ షెడ్యూల్‌పై హరీష్ రావు విమర్శలు
- పండుగలతో పనిదినాలు తగ్గాయని ఆరోపణ
- బడ్జెట్ చర్చకు సమయం సరిపోదన్న అభిప్రాయం
- ఆదివారం సభకు తమకు అభ్యంతరం లేదన్న హరీష్ రావు

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు. సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని, ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు.

2లో

అసెంబ్లీ వారం రోజులు కూడా నడవదు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాల అజెండాపై క్లారిటీ ఇస్తూ, మార్చి 17 , 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని ఆయన వెల్లడించారు. అయితే, బడ్జెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను నిర్వహించాలని భావిస్తోంది. దీనిపై స్పందించిన హరీష్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూస్తోందని, దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆయన విమర్శించారు.

పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఉన్నారు: పవన్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళిగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన 125వ జయంతి సందర్భంగా అమరావతిలోని శాఖమూరులో ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహానుభావుడని అన్నారు. స్వాతంత్ర్య సమర కాలంలో మహాత్మా గాంధీ 'నా వెంట 11 మంది ఉంటే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను' అన్న మాటలను గుర్తుచేశారు. అలాంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఎల్‌పీజీ సంక్షోభంపై కేంద్రం అబద్ధాలు చెబుతోంది : మల్లిఖార్జున ఖర్గే

న్యూఢిల్లీ: ఇరాన్ వార్‌తో దేశంలో ఎల్‌పీజీ గ్యాస్ లభ్యంత గందరగోళంగా మారింది. సోమవారం పార్లమెంటులో ఈ సంక్షోభంపై దుమారం రేగింది. ఒకవైపు ఎల్‌పీజీ కొరతలేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి ఆందోళనగా కరంగా ఉందని కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. దీంతో ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపి) మల్లికార్జున్ ఖర్గే, జె.పి. నడ్డా మధ్య వాగ్వాదంచోటు చేసుకుంది. జీరో అవర్ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, గల్ఫ్ యుద్ధం మరియు హార్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఎల్‌పిజి సరఫరాపై ఆందోళనలు చెలరేగుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ కేంద్రంపై మండిపడింది. రాజ్యసభలో ఎల్‌పిజి సంక్షోభ అంశాన్ని లేవనెత్తిన మల్లికార్జున్ ఖర్గే సిలిండర్ల ప్యానిక్ బుకింగ్‌పై ఖర్గే విమర్శలు గుప్పించారు. ఎల్‌పిజి సమస్య మధ్యతరగతి, రెస్టారెంట్లు, హాస్టళ్లు , వాణిజ్య వినియోగ దారులను ప్రభావితం చేస్తోంది. ప్రస్తుత పరిస్థితిలో, ఎల్‌పిజి లభ్యత, ధర స్థిరత్వం తీవ్రమైన సమస్యలుగా మారాయనే విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. కేంద్ర పెట్రోలియం మంత్రి ఎల్‌పిజి కొరత లేదని లోక్‌సభలో ప్రకటించిన వైనాన్నిఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్న వాదనలు తప్పు అని వాస్తవాలు రుజువు చేస్తున్నామని మండిపడ్డారు.హార్ముజ్ జలసంధి దిగ్బంధనంతో తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని ప్రభుత్వం సరిగ్గా నిర్వహించలేదని ఖర్గే ఆరోపించడంతో జీరో అవర్ సమయంలో ఘర్షణ చెలరేగింది. ఖదేశవ్యాప్తంగా ఎల్‌పిజి సిలిండర్ల తీవ్ర కొరతకు ప్రభుత్వమే కారణమని ఖర్గే అన్నారు. మధ్యతరగతి , పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. రెస్టారెంట్లు, హాస్టళ్లు కమ్యూనిటీ కిచెన్‌లను మూసివేయాల్సి వచ్చిందని, ఎల్‌పిజి సిలిండర్లను అధిక ధరలకు అమ్ముతున్నారని ఆయన పేర్కొన్నారు. దేశంలో 60 శాతం ఎల్‌పిజి దిగుమతి అవుతుందని, ఇందులో 90 శాతం సరఫరా హార్ముజ్ జలసంధి ద్వారా జరుగుతుంద న్నారు. ప్రపంచ చమురు సంక్షోభానికి దారితీసే కీలకమైన సముద్ర మార్గం ఇది అని అన్నారు. ఎల్‌పిజి సరఫరాపై కేంద్రం ముందస్తు ప్రణాళిక వేసుకుని ఉంటే, ఈపరిస్థితి తలెత్తేది కాదన్నారు. ఖర్గే ఎరువుల సరఫరా కొరతను కూడా ఎత్తిచూపారు. అలాగే సిలిండర్ కోసం వెయిటింగ్ సమయాన్ని కూడా 21 - 25 రోజులకు పెంచారు, ఇది, బ్లాక్ మార్కెటింగ్‌కు దారితీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రభుత్వ పేలవమైన ప్రణాళిక నిదర్శనమని, ఇది విదేశాంగ విధానంపై కూడా ప్రశ్నలను లేవనెత్తుతుదని ఖర్గే మండిపడ్డారు. ప్రణాళిక లేకపోవడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి దేశంలో ఎల్‌పిజి సరఫరాపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ఖర్గే విమర్శలతో సభలో వేడి రాజుకుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, నడ్డా కూడా స్పందించారు. జీరో అవర్ కారణంగా సభ్యులు ప్రజా సమస్యలపై లేవనెత్తాల్సిన అవసరం ఉందని, చైర్ జోక్యం చేసుకోవాలని నడ్డా కోరారు. సభలో తీవ్రమైన అంశాలపై చర్చలు జరుగుతున్నపుడు వాటిపై శ్రద్ధపెట్టకుండా ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ్రా+ సమస్యపై మాట్లాడకుండా ఇతర అంశాలపై మాట్లాడటానికే మొగ్గు చూపారంటూ రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు.

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

అదే ప్రజా పాలనకు గీటురాయి. రాష్ట్ర అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ కేంద్రంగా జరగాలనే పాత మోడల్‌కు ప్రజా ప్రభుత్వం ముగింపు పలికింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా, సమతుల్యంగా, సమ్మిళితంగా అభివృద్ధి చేసేందుకు ముందడుగు వేసింది. క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్, ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్), రేర్ (రూరల్ అగ్రి రీజియన్)తో వికేంద్రీకత వ్యూహాన్ని అనుసరిస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసి భవిష్యత్తు తెలంగాణను నిర్మిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ రైజింగ్ విజన్2047'డాక్యుమెంట్‌ను ఆవిష్కరించింది. 'వికసిత్ భారత్ 2047 విజన్'కు అనుగుణంగా, నీతి ఆయోగ్, ఐఎస్‌బీ, నల్సార్ వర్సిటీని సంప్రదించి దీన్ని రూపొందించింది. ప్రస్తుతం తెలంగాణ ఆర్థికంగా సుస్థిర స్థానంలో ఉంది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుస్థిర వృద్ధి నమోదు చేస్తోంది. 202526లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతం. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరుకుంది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని 0.2 శాతానికి ప్రభుత్వం నియంత్రించింది. ధరల స్థిరత్వం కొనసాగించింది. గత రెండేళా–ల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎన్నో చర్యలు చేపట్టింది. రాష్ట్రం వేగంగా పట్టణీకరణ చెందుతోంది. 2031 నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనా. పట్టణాల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. ఇది నగర పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తుంది. మహా నగరంలో పరిపాలనా సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు హైదరాబాద్ పోలీసు అధికార పరిధిని విస్తరించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, కొత్తగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించింది. క్యూర్ పరిధిలోని ప్రాంతాన్ని పారిశ్రామిక కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని నిర్ణయించింది. దీంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. క్యూర్ ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించింది. క్యూర్ పరిధిలోని నీటి వనరులను పునరుద్ధరించేందుకు హైడ్రాను ఏర్పాటు చేసి దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణకు, కబ్జాలకు గురైన చెరువు భూములు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంది. ఫలితంగా బతుకమ్మ కుంట, నల్ల చెరువు, బమ్ రుక్ ఉద్‌దౌలా చెరువులు పూర్వ వైభవం సంతరించుకున్నాయి. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య ఉన్న ప్యూర్ ప్రాంతాన్ని ఇరీన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. తెలంగాణ పశ్చిమ ప్రాంతంలో ఉన్న కొడంగల్ ఏరియా ఇండ్రస్టియల్ హబ్ గా మారనుంది. జహీరాబాద్‌లో 3,245 ఎకరాల్లో నేషనల్ ఇండ్రస్టియల్ కారిడార్ స్మార్ట్ సిటీ అభివృద్ధి జరుగుతోంది. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు ఫేజ్1 ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభమవుతుంది. గోదావరి నీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు అనుసంధానించడం ద్వారా 2.5 టీఎంసీల నీటిని మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అందిస్తారు. దీంతో క్యూర్ ప్రాంతానికి రోజుకి 300 మిలియన్ గ్యాలన్ల తాగునీరు అందుతుంది. హైదరాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ, అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైదరాబాద్‌అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కేంద్రం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణెలకు మూడు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లను ప్రకటించింది. ఈ నేపథ్యంలో శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. 56 గ్రామాలు, ఏడు మండలాలతో 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైంది. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఏర్పాటు కానుంది. తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చేలా ఆవిష్కరణలకు, పెట్టుబడుల సాధనకు, సుస్థిర అభివద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇటీవల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించింది. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక రంగంలోని ప్రముఖులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది.

చంద్రబాబు కోసమే సునీత ఆరాటం

(మొదటి పేజీ తరువాయి)

దస్తగిరికి సునీత మద్దతుగా నిలబడటం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. దస్తగిరి బెయిల్ రద్దు చేయాలని మేము కోర్టును కోరితే, ఆమె మాత్రం లూథ్రా వంటి ఖరీదైన న్యాయవాదులను పెట్టి అతడికి అండగా ఎలా నిలబడతారని నిలదీశారు. హత్య జరిగిన వెంటనే వివేకానంద రాసిన లేఖ గురించి పీఏ కృష్ణారెడ్డి ద్వారా సమాచారం అందినప్పటికీ, పోలీసులు వచ్చే వరకు ఆ లేఖను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. సీబీఐ ముందు సునీత ఒకసారి లేఖ గురించి తెలుసునని, మరోసారి తెలియదని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారని... ఇలా స్టేట్‌మెంట్లు మార్చడం వెనుక ఉద్దేశం ఏంటి? లేఖను దాచిపెట్టడం నేరం కాదా? అందులో ఉన్న నిజాన్ని ఎందుకు తొక్కిపెట్టారో సమాధానం చెప్పాలన్నారు. మరోవైపు వివేకానందరెడ్డి గారి రెండో భార్య షమీమ్, ఆమె కుమారుడికి ఆస్తిలో వాటా వెళ్తుందనే భయంతో ఈ హత్య జరిగి ఉండవచ్చన్న అవినాష్ రెడ్డి... ఇది 'మర్డర్ ఫర్ గెయిన్' (ఆస్తి కోసం జరిగిన హత్య) కోణం కాదా? ఈ విషయాలపై దర్యాప్తు చేయాలని సునీత ఎందుకు కోరడం లేదని నిలదీశారు. షమీమ్ కుమారుడికి డీఎన్ఏ టెస్ట్ చేయించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. అలాగే వివేకాకు, షమీమ్‌కు మధ్య నడిచిన చాట్స్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసును వచ్చే ఎన్నికల వరకు లాగడం ద్వారా చంద్రబాబుకు పొలిటికల్ మైలేజ్ ఇవ్వడమే సునీత లక్ష్యంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు.. ఢిల్లీలో ఉన్న కొందరు పెద్ద మనుషుల అండతో, టార్గెటెడ్ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారని మండిపడ్డారు. అయితే న్యాయం గెలిచే రోజు వస్తుందని... మమ్మల్ని అనవసరంగా నిందించిన వారంతా ముక్కున వేలేసుకునే రోజు దగ్గర్లోనే ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరగా విచారణ పూర్తి చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి అని అవినాష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వివేకానంద రెడ్డి గారి హత్య అనంతరం నిందితులు విచారణలో అనేక విషయాలు చెప్పారు. వివిధ లావాదేవీల్లో వైఎస్ వివేకానందరెడ్డికి డబ్బులు, డైమండ్స్ రూపంలోనూ, ల్యాండ్ సెటిల్మెంట్ రూపంలో రావాల్సి ఉంది. దాని కోసం వివేకానందరెడ్డి గారు కొంత మొత్తంలో డబ్బులు ఖర్చుపెట్టారు. ఆ ఖర్చు పెట్టిన డబ్బు పోయిందీ, రావాల్సిన డబ్బు రాకుండా పోయిందన్న బాధ ఆయనకు ఉంది. అందుకే అందరి మీద కోప్పడేవారని ఉంది. దాని మీద ఎందుకు తదుపరి దర్యాప్తు సునీత కోరడం లేదు?. మరోవైపు తొలిసారి 161 స్టేట్‌మెంట్‌లో దస్తగిరి... వివేకానందరెడ్డి గారిని చంపక ముందు డాక్యుమెంట్లు గురించి అడిగామని చెప్పారు. ఆ డాక్యుమెంట్లు ఎక్కడున్నాయో కనుక్కోవడానికి ఆయన్ను తీవ్రంగా కొట్టామని చెప్పారు. ఆ డాక్యుమెంట్లు ఎక్కడున్నాయో కనుక్కున్న తర్వాత అవి తాము అనుకున్నవో కావో తేల్చుకున్న తర్వాతే చంపామని చెప్పాడు. హత్య అనంతరం రెండు మూడు సార్లు డాక్యుమెంట్లు వెరిఫై చేసుకున్న తర్వాతే బయటకు వెళ్లామని కూడా చెప్పాడు. మీకు అత్యంత ఆప్తుడైన దస్తగిరి ఇంత స్పష్టంగా చెప్పాడు.

ముస్లింలకు అండగా ఉంటాం

అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. "4.38 లక్షల మంది ముస్లింలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నాం. ఏడాదికి రూ.3,511 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 4.5 లక్షల మంది ముస్లిం విద్యార్థులకు 'తల్లికి వం దనం' ఇస్తున్నాం. 19,215 మంది ముస్లిం విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్పులకు రూ.264 కోట్లు విడుదల చేశాం. ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజన్లకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతన ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ.180 కోట్లు గౌరవ వేతనంగా అందించాం." అని చంద్రబాబు అన్నారు. అర్హత కలిగిన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వివాహ లైసెన్స్ గడువు 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచామని చెప్పారు. టీడీపీ హయాంలోనే గతంలో హైదరాబాద్ నుంచి ముస్లింలను హజ్ యాత్రకు పంపించామని గుర్తుచేశారు. 1,500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేశామని, వాటిని కాపాడుతున్నామని సీఎం చెప్పారు. కాగా, ఇఫ్తార్ విందులో భాగంగా డాక్టర్ జావేద్ రాసిన "గోలు అండ్ పప్పా- ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవ్రీ హోం" పుస్తకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు.

ఇమామ్‌లు, మౌజన్లకు రూ.45 కోట్లు

మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.45 కోట్లు విడుదల చేసింది. మైనార్టీ సంక్షేమశాఖ ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలోని 5000 వేల మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు 2025 అక్టోబరు నుంచి 2026 మార్చి వరకు ఆరు నెలలకు ప్రతి మసీదులో నెలకు రూ.15000 వేల చొప్పున గౌరవ వేతనం అందించేందుకు ఈ నిధులు విడుదల చేసింది.

ఇరాన్‌పై బాంబుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ముమ్మరంగా దాడులు చేశాయి. ఇస్ఫహాన్, నతాంజ్‌లోని అణు కేంద్రాలపైనా దాడులు జరిగాయి. ఇరాన్‌వ్యాప్తంగా డ్రోన్ తయారీ ఫ్యాక్టరీలు, సదుపాయాలనే ప్రధానంగా లక్ష్యం చేసుకున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. క్షిపణి, డ్రోన్ తయారీ కేంద్రాలు నేలమట్టమై ఇరాన్ యుద్ధపాటవం ఇప్పటికే విపరీతంగా క్షీణించినట్టు చెప్పారు. దాడుల్లో టెహ్రాన్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ క్లినిక్ బాగా దెబ్బ తిన్నట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఇరాన్ క్షిపణి లాంచర్లలో 70 శాతానికి పైగా తమ దాడుల్లో ఇప్పటికే కుప్పకూలినట్టు ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నడావ్ షోహానీ తెలిపారు. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు 85 శాతం దాకా తుడిచిపెట్టుకుని పోయాయన్నారు. ఇజ్రాయెల్ ఒక్కటే ఇరాన్‌లో ఇప్పటిదాకా ఏకంగా 7,600పై చిలుకు లక్ష్యాలను నేలమట్టం చేసినట్టు చెప్పారు. ఇంకా వేలాది లక్ష్యాలను సర్వనాశనం చేయనున్నట్టు వెల్లడించారు. యుద్ధం, హోర్మూజ్ జలసంధి మూత తదితర పరిణామాలతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు నానాటికీ ఎగబాకుతూ గుబులు రేపుతూనే ఉన్నాయి. చమురు బ్యారెల్ ధర సోమవారం కూడా 100 డాలర్లకు పై స్థాయిలోనే కొనసాగింది. ఇరాన్ డ్రోన్ దాడులు దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మరోసారి వణికించాయి. ఒక డ్రోన్ పేలుడుతో చమురు ట్యాంక్‌కు మంటలంటుకుని భారీ పేలుళ్లు సంభవించాయి. వాటిని ఆర్పేందుకు చాలాసేపటిదాకా శ్రమించాల్సి వచ్చింది. దాంతో విమానాశ్రయంలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపేశారు. పలు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. యూఏఈలోని ఫుజైరా పారిశ్రామిక జోన్‌పైనా డ్రోన్ దాడులు జరిగాయి. అక్కడ పలుచోట్ల మంటలు చెలరేగాయి. తమ దేశ తూర్పు ప్రాంతంలోని చమురు క్షేత్రాలే లక్ష్యంగా సోమవారం ఇరాన్ ప్రయోగించిన 35 డ్రోన్లను అడ్డుకున్నట్టు సౌదీ అరేబియా, ఆరు క్షిపణులు, 21 డ్రోన్లను కూల్చినట్టు యూఏఈ వెల్లడించాయి. తమ దేశంపై నాలుగు క్షిపణులు, మూడు డ్రోన్లు పడ్డట్టు బహ్రెయిన్ తెలిపింది. అబుదాబిపై జరిగిన క్షిపణి దాడిలో ఒక పాలస్తీనా పౌరుడు మరణించినట్టు ఆ దేశ మీడియా పేర్కొంది. అటు ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ పెద్దపెట్టున దాడులు కొనసాగించింది. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్ సహా పలు నగరాల్లో ప్రజలు బంకర్లకేసి పరుగులు తీశారు. చాలా క్షిపణులను, డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. క్షిపణి తాలూకు కూల్చేసిన భాగాలు పడి జెరూసలేం పాత నగరంలో ఓ ప్రార్థనాలయం దెబ్బ తిన్నట్టు తెలిపింది. ఖర్గ్ దీవిపై దాడుల కోసం పలు గల్ఫ్ దేశాల్లోని పోర్టులు, డాక్‌లను అమెరికా వాడుకున్నట్టు ఇరాన్ తాజాగా ఆరోపించింది. లెబనాన్‌పై దాడుల తీవ్రతను సోమవారం ఇజ్రాయెల్ మరింత పెంచింది. రాజధాని బీరూట్‌తో పాటు పలు ప్రాంతాలు క్షిపణి, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిపోయాయి. దక్షిణాది ప్రాంతంలో జరిగిన వైమానిక దాడులకు ఫార్ సర్ గ్రామంలో ఏడుగురు బలైనట్టు ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. వారిలో ఇద్దరు వైద్య సిబ్బందని వెల్లడించింది.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- యాదాద్రి కోర్టులో న్యాయమూర్తి మాధవీలత సమీక్ష

యాదాద్రి భువనగిరి, మార్చి 16 (తొలివెలుగు న్యూస్) : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని సంస్థ కార్యదర్శి వి. మాధవీలత పిలుపునిచ్చారు. సోమవారం యాదాద్రి భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించిన ఆమె, న్యాయవాదులు, పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. యాదాద్రి కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను గుర్తించి, కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. "లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంతో సమయం, డబ్బు ఆదా అవుతాయి. పోలీసు శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నోటీసులు సకాలంలో అందేలా చూడాలి" అని పేర్కొన్నారు. ప్రి-సిట్టింగ్స్ నిర్వహించడం ద్వారా ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిర్చే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యాదాద్రి జూనియర్ సివిల్ జడ్జి కె. చండీశ్వరి దేవి, ఎపిపిఒ అవినాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీహరి, ఉపాధ్యక్షులు పెంట రమేష్, కార్యదర్శి కృష్ణయ్య, న్యాయవాదులు స్వామి, మీడియేషన్ న్యాయవాది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజపేట ఎస్ఐ లింగారెడ్డి, యాదగిరిగుట్ట ఎస్ఐలు కృష్ణస్వామి, లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

- రాజపేటలో వెల్లివిరిసిన మత సామరస్యం
- వార్డు సభ్యురాలు చెల్మిడి రేవతి-వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు

రాజపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్) : మండల కేంద్రంలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక వార్డు సభ్యురాలు చెల్మిడి రేవతి, ఆమె భర్త వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులు ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షలను విరమించి, వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని కొనియాడారు. కార్యక్రమంలో రాజాపేట మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కాకర్ల ఉపేందర్, రాజాపేట పట్టణ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెడిద వీరేశం, గొల్లపల్లి సాయి, ఎండీ ఉస్మాన్, ఎండీ గోరిమియా, ఎండీ తాయాబలి, మహమ్మద్ మద్దూం, ఎండీ జహంగీర్, హైమద్, ఎండీ కాజా తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు 'రంజాన్ తోఫా' పంపిణీ

- సోమారంలో కిట్లు అందజేసిన సర్పంచ్ అనూష

రాజపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని సోమారం గ్రామంలో ముస్లిం కుటుంబాలకు సోమవారం 'రంజాన్ తోఫా' కిట్లను అందజేశారు. బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పంపిణీలో పలువురు ముస్లిం లబ్ధిదారులకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేద ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఈ తోఫా అందజేశారని తెలిపారు. ఈ తోఫా అందుకున్న మహమ్మద్ బషీర్, అంక్షావలి, జహంగీర్ తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగా శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మకంటి జంపయ్య గౌడ్, మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు పుప్పాల పద్మ, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ యాదగిరి, గిరిరాజు స్వామి, బురద సురేష్, బండ నరేష్, తవిటి బాలరాజ్, చౌదరిపల్లి శ్రీనివాస్, తమ్ముడి వంశీధర్, జంగ శేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో 'పరాభవ' పంచాంగానికి ప్రత్యేక పూజలు





- శ్రీవారి పాదాల చెంత శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

రాజపేట, మార్చి 16: (తొలివెలుగు న్యూస్): రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం (2026-27) 'శ్రీ పరాభవ నామ సంవత్సర' పంచాంగానికి సోమవారం యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పాదాల చెంత, అలాగే కొండపై వేంచేసి ఉన్న శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి స్పటిక లింగం వద్ద అర్చకులు శాస్త్రోక్తంగా అర్చనలు చేశారు. అనంతరము అర్చక స్వాములు మంగవల్లి సాందీపని, నరసింహమూర్తిలకు ఆలయ నిర్వాహకులు పంచాంగాన్ని అందజేశారు. అంతకుముందు ఈ నెల 13న రాజపేటలో జరిగిన కార్యక్రమంలో యాదగిరిగుట్ట పూర్వ ప్రధాన అర్చకులు నల్లన్ తీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, విజయలక్ష్మి దంపతులు ఈ పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో, అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ప్రత్యేక శ్రద్ధతో రూపొందించిన ఈ పంచాంగ ముద్రణ శైలిని పలువురు భక్తులు, ప్రముఖులు అభినందించారు.

నిషేధిత జాబితా నుంచి ఇళ్లను తొలగించాలి

- రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ డిమాండ్

రాజపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): మండలంలోని రఘునాథపురం గ్రామంలో 22-ఎ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చిన నివాస గృహాలను వెంటనే తొలగించాలని సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 276, 277, 278, 308, 245, 250లలో ఉన్న సుమారు 239 ఇళ్లను ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చడం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

70 ఏళ్ల క్రితం కొనుగోలు చేసినవే..

సుమారు ఏడు దశాబ్దాల క్రితమే ఈ స్థలాలను కొనుగోలు చేసి, లక్షల రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మించుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అకస్మాత్తుగా వీటిని ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ క్రయవిక్రయాలు నిలిపివేయడం, బ్యాంకు రుణాలు రాకుండా చేయడం అన్యాయమని అన్నారు. బాధితులకు న్యాయం జరగకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొండం రాజు, మాజీ సర్పంచ్ రామిళ్ల నరేందర్, వార్డు సభ్యులు తుంగ అక్షయ్ కుమార్, తుంగ సతీష్, పార్టీ సీనియర్ నాయకులు నల్ల అశోక్, కలకుంట్ల పోచయ్య, బింగి బాలరాజు, ఆర్‌కే ప్రభాకర్, కటకం వెంకటేశం, ఉప్పల సిద్ధిలింగం, శెట్టి శ్రీరాములు, బత్తిని పరుశురాం, ఉపాధ్యక్షులు బత్యం కనకరాజు, బొద్దుల శ్రీకాంత్, బొట్టు భాను, సంగిశెట్టి అనిల్, కటకం పృథ్వీరాజ్, ఎడ్ల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- బోగారం సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్

రామన్నపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామంలో 99 రోజుల ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్ పలు అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువు, పరిశుభ్రత, భోజనశాల మెనూ తదితర అంశాలపై పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తరువాత అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని, వారి ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ క్షేత్రాన్ని పరిశీలించారు. ఇక ఉపాధి హామీ పనుల ప్రదేశాలను సందర్శించి కూలీలకు వేసవి కాలంలో తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, తీవ్ర వేడిని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటిస్తూ పనులు కొనసాగించాలని సూచించారు. గ్రామంలో నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుని బోరు మోటార్ల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వృథా చేయకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బైకాని ఉమామహేష్ యాదవ్, వార్డ్ సభ్యులు గోగు ప్రమీలరమేష్, కనుక మల్లేశం, మేడి ఆంజనేయులు దేవి, నేరటి మానససురేష్, కడారి పావనిపాపయ్య, గోగు సురేష్, చిరగొని కల్పననవీన్, వనం అండాలుయాదగిరి, భోగ సహదేవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విమలమ్మ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలపై దాడులు ఆపాలి: సిపిఐ

- రాజపేటలో ట్రంప్ తీరుకు వ్యతిరేకంగా నిరసన

రాజపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో సోమవారం రాజపేట గాంధీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొల్లూరి రాజయ్య మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తూ ఇరాన్‌పై అమెరికా దాడులు చేయడం సరికాదన్నారు.

సామ్రాజ్యవాదం వీడాలి:

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామ్రాజ్యవాదాన్ని విస్తరించేందుకు గల్ఫ్ ప్రాంతంలో బాంబులు, మిస్సైళ్లతో దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి సూచనలను సైతం బేఖాతరు చేస్తూ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ఈ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ

సభ్యుడు చిగుర్ల లింగం, జిల్లా కౌన్సిల్ సభ్యులు మూలపోచయ్య, ఇంజ హేమలత, రైతు సంఘం నాయకులు ఒగ్గు కరుణాకర్, మహిళా సంఘం నాయకురాలు చంద్రకళ, చల్లూరు గ్రామ శాఖ నాయకుడు నరసింహ, బొందుగుల కమ్యూనిస్టు పార్టీ నాయకుడు గొల్లూరి రాములు, కార్మిక సంఘం నాయకులు తరిగొప్పుల సిద్ధులు, హమాలీ సంఘం అధ్యక్షుడు దయ్యాల సిద్ధులు, ఉచ్చేంతల బాలయ్య, మూల హరినాథ్, నంద మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు 'బోగారం' పట్టు సిరి

రామన్నపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన చేనేత కళాకారులు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం కోసం పట్టు వస్త్రాలను తయారు చేస్తున్నారు. గ్రామ చేనేత కళాకారులు తమ చేతి నైపుణ్యంతో నేసిన ఈ పట్టు వస్త్రాలను భద్రాచలం పుణ్యక్షేత్రానికి సమర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి బోగారం గ్రామ సర్పంచ్ కునూరు సాయికుమార్ గౌడ్ తన వంతు సహకారం అందిస్తూ చేనేత కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా భద్రాచలం దేవాలయం ఈవో దామోదర్ రావు బోగారం గ్రామాన్ని సందర్శించి పట్టు వస్త్రాలు తయారు చేస్తున్న చేనేత



మగ్గాలను పరిశీలించారు. కళాకారుల పనితీరును అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో చేనేత కళాకారుల సంఘం అధ్యక్షుడు రాపోలు గణేష్, ఎలగందుల కరుణాకర్, గుర్రం శ్రీనివాస్, గుర్రం సంతోష్, మిర్యాల సురేందర్, నేరటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

- రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలుగా మార్చాలి: సీపీఎం
- ప్రారంభమైన సీపీఎం నిరవధిక నిరాహార దీక్షలు

రామన్నపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి అసెంబ్లీ సమావేశాల్లో రూ.40 కోట్ల నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద నిరవధిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. మండల నాయకులు ఎనిమిది మంది దీక్షలో కూర్చోగా వారికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రంగా ఎనిమిది మండలాల ప్రజలకు దాదాపు 56 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి ప్రస్తుతం పాత భవనంలో ప్రమాదకర పరిస్థితుల్లో కొనసాగుతోందన్నారు. ఏరియా ఆసుపత్రి బోర్డు ఏర్పాటు చేసి దాదాపు పదేళ్లు గడిచినా ఆచరణలోకి రాలేదని, 50 పడకల ఆసుపత్రి కోసం అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శిలాఫలకం వేసి మూడు సంవత్సరాలు గడిచినా నిధులు విడుదల కాలేదని విమర్శించారు. ప్రస్తుతం ఆసుపత్రి ప్రాథమిక చికిత్స, పోస్టుమార్టంలకే పరిమితమైందని, పేదలకు అవసరమైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ప్రతిరోజూ సుమారు 400 మంది అవుట్‌పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ డాక్టర్లు, సదుపాయాలు లేక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ సెంటర్ లేకపోవడంతో ప్రతిసారి ప్రైవేటు ఆసుపత్రులకే వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో రూ.40 కోట్ల నిధులు కేటాయించి 100 పడకల నూతన ఆసుపత్రి భవనం నిర్మించాలని, మౌలిక సదుపాయాలు కల్పించి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే వరకు నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ నిరవధిక నిరాహార దీక్షలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహాచారి, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, నాగటి ఉపేందర్, వేముల సైదులు, శానకొండ రాము పాల్గొన్నారు. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఫజల్ బేగ్, నకిరేకంటి గణేష్, దండగుల రాములు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గాజుల ఆంజనేయులు సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, జంపాల అండాలు, మండల నాయకులు గన్నేబోయిన విజయభాస్కర్, నీల అయిలయ్య, ఎండీ రషీద్, గాదె నరేందర్, ఆవనగంటి నగేష్, బొడిగె రజిత, తొలుపునూరి శ్రీనివాస్, మేడి గణేష్, శాఖ కార్యదర్శులు మునికుంట్ల లెనిన్, తాళ్లపల్లి జితేందర్, పులిబిక్షం, గుండాల ప్రసాద్, గోగు లింగస్వామి, కొమ్ము అంజమ్మ, కూనూరు మల్లేశం, గన్నేబోయిన శ్రీనివాస్, ఆవనగంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలనా పగ్గాల చేపట్టిన చిచ్చరపిడుగులు

- ఉపాధ్యాయులుగా అలరించిన విద్యార్థులు..!
- దుబ్బాక గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం

రామన్నపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒకరోజు పాటు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎంఆర్వో, డీఈఓ, ఎంఈఓ, సర్పంచ్, ఉపాధ్యాయుల పాత్రలను పోషిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. కలెక్టర్‌గా రావుల శివరాం, పాఠశాల హెడ్‌మాస్టర్‌గా గుండాల వైష్ణవి, విద్యాశాఖ మంత్రిగా జి. అక్షయ, ఎమ్మెల్యేగా కంబాలపల్లి నిత్యశ్రీ, డీఈఓగా దాసరి కాలేబ్, ఎంఆర్వోగా మద్దెగళ్ళ నిహారిక, ఎంఈఓగా జి. శ్రీనిత్య, సర్పంచ్‌గా సింగారపు హర్షవర్ధన్ తమ తమ బాధ్యతలను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గట్టు నర్సింహ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొలను లలిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప పౌరులుగా ఎదిగి దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యే విజయానికి పునాది కావడంతో బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండాల రమేశ్, ఏఏపీసీ చైర్మన్ తుమ్మల పల్లవి, ఉపాధ్యాయులు పి. రేణుక, డి. ధనమ్మ, చ. రవి, వాలంటీర్లు సుస్మిత, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ కమిటీతోనే ఉద్యమకారులకు న్యాయం

- రాజకీయ కమిటీలను అంగీకరించబోం: సంగిశెట్టి క్రిస్టఫర్

వలిగొండ, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం జ్యుడీషియల్ కమిటీని మాత్రమే నియమించాలని మలిదశ ఉద్యమకారుడు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. సోమవారం వలిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ నాయకులతో లేదా గతంలో పనిచేసిన టీజేఏసీ నాయకులతో కమిటీలు వేస్తే రాజకీయ ప్రాధాన్యతలకే ప్రాముఖ్యత లభిస్తుందని, దీనివల్ల క్షేత్రస్థాయిలో పోరాడిన నిజమైన ఉద్యమకారులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టబద్ధత కలిగిన జ్యుడీషియల్ కమిటీ ద్వారానే పారదర్శకమైన గుర్తింపు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వారికి తగిన గుర్తింపు, గౌరవం దక్కాలంటే ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి శవం.. రైలు నుంచి జారిపడి మృతి

- నాగిరెడ్డిపల్లి - వలిగొండ మధ్య విషాదం

వలిగొండ, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తూ జారిపడి గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. వలిగొండ - భువనగిరి మధ్య నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 21/3-4 కిలోమీటర్ రాయి వద్ద సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మృతుడు నీలం రంగు లోయర్ ప్యాంట్, తెలుపు-నీలం రంగు కలిసిన చొక్కా ధరించి ఉన్నాడు. కోల ముఖం, చిన్నపాటి గడ్డం కలిగి ఉన్నాడని పోలీసులు తెలిపారు. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ రామారావు ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్ఐ బి. రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వర గా పరిష్కరించాలి

ఉట్నూర్, మార్చి:(తొలివెలుగు న్యూస్): ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖా స్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలిం చి త్వరగా పరిష్కరించే విధం గా అధికారులు సమన్వయం తో చర్యలు తీసుకోవాలని స మగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రా జెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమ వా రం కార్యాలయం నిర్వహించి న ప్రజావాణి కార్యక్రమంలో వి విధ సమస్యలపై ప్రజల నుం చి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం ఘన్ పూ ర్ గ్రామానికి చెందిన ఆత్రం లో కేష్ తనకి పై చదువుల నిమి త్తం ల్యాప్ టాప్ మంజూరు క ల్పించామని, సిర్పూర్ (యు)మండలం సిర్పూర్ గ్రా మానికి చెందిన గేడం గజా నంద్ తనకి ఏకలవ్య పాఠ శాలలో స్లీపర్ ఉద్యోగం కొరకు కోరారు. సిరికొండ మండలం సిరికొండ గ్రామానికి చెందిన రామారావు తనకి సోలార్ పంపు సేంట్ మంజూరు కొర కు అర్జీ కోరారు,వివిధ ప్రాంతా ల నుండి వచ్చిన ప్రజలు పిం ఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథ కాల మం జూరు, వ్యవసా య, రెవెన్యూ శాఖలకు సం బంధించిన సమస్యలు పరి ష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- రేణికుంట, దూదివెంకటాపురంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పర్యటన

రాజపేట, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కోరారు. సోమవారం మండలంలోని దూదివెంకటాపురంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చూడటంలో గ్రామస్థులు సహకరించాలన్నారు. గ్రామ సమస్యలను సభలోనే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రేణికుంటలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని, తాగునీటి సౌకర్యం నిరంతరం అందుబాటులో ఉండాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తర్వాత గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, మార్చి 31లోగా 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ కిషన్, అధికారులు పాల్గొన్నారు.

మార్చి 31లోగా 100 శాతం పన్ను వసూలు చేయాలి

- కొలనుపాక పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

ఆలేరు, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఇంటి పన్ను వసూలు వెన్నెముక వంటిదని, మార్చి 31వ తేదీ లోపు గ్రామంలో 100 శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు.

పనితీరు మారాలి.. సేవలు అందాలి:

అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని, ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. "గడువులోపు పన్ను వసూళ్లు పూర్తి చేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, విద్యార్థులకు రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లోని నర్సరీలను సందర్శించి మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిషన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

వలిగొండ, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): వలిగొండ మండల కేంద్రానికి చెందిన దయ్యాల బాలరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం బాలరాజు చిన్ననాటి మిత్రుడు పబ్బు రామ్ గౌడ్‌తో పాటు నవభారత్ డిగ్రీ కాలేజ్ బీఎస్సీ (20022005) బ్యాచ్‌కు చెందిన మిత్రులు మృతి చెందిన స్నేహితుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు రూ.5,000లను ఆర్థిక సహాయంగా అందజేశారు. బాలరాజు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అవసరమైన సమయంలో సహాయం చేస్తామని మిత్రులు తెలిపారు. కార్యక్రమంలో మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

భూ బాధితులకు మూడు రెట్ల పరిహారం చెల్లించాలి

- సమ్మెకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు

వలిగొండ, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): గౌరెల్లి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న నూతన రహదారి కోసం భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా మూడు రెట్ల పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గౌరెల్లిభద్రాచలం భూ బాధితుల సంఘం ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలోని భువనగిరి రహదారి పక్కన రైతులు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులంతా చిన్న, సన్నకారు రైతులేనని పేర్కొన్నారు. రైతుల అనుమతి లేకుండా షార్ట్ లైట్ సర్వేలు నిర్వహిస్తూ ప్రభుత్వం బలవంతంగా భూములను సేకరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వెంటనే ఈ విధానాన్ని ప్రభుత్వం నిలిపివేయాలని, గ్రామ సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని కోరారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్ విలువను ఆధారం చేసుకుని మూడు రెట్ల పరిహారం చెల్లించి, రైతుల అనుమతితోనే సర్వేలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి భూనిర్వాసితుల సంఘం నాయకుడు మల్గ రవీందర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వలిగొండ మాజీ సర్పంచ్ పలుసం రమేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, రైతు సంఘం జిల్లా నాయకుడు చీర్క శ్రీశైలం రెడ్డి, దాసిరెడ్డిగూడెం సర్పంచ్ రాపోలు గోపి, లింగరాజుపల్లి సర్పంచ్ బొడిగె లింగస్వామి, సీపీఎం మండల కమిటీ సభ్యులు భీమనబోయిన జంగయ్య, కొండే కిష్టయ్య, మంగ బాలయ్య, భూనిర్వాసితులు వెంకట్ రెడ్డి, నారి రమేష్, మల్గ నరేష్, అప్పిడి వెంకట్ రెడ్డి, మల్గ అయ్యన్న, నాగులు తదితర రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

మంచిర్యాల, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల ఆదర్శ పాఠశాలలు సోమవారం సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఆహారం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. బాలికల వసతి గృహంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండలం గుడిపేట లోని చందనాపూర్ లో గల పట్టణ ఆవాస పాఠశాలను సందర్శించి పాఠశాలలో చేపట్టిన అదనపు గదులు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంటశాలను సందర్శించి విద్యార్థుల ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు.

హైదరాబాద్‌లో క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి కృషి చేస్తా : మంత్రి వివేక్ వెంకటస్వామి

మంచిర్యాల, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): హైదరాబాద్ నగరంలో క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి జి . వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ అనుమతి తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నా రు. ఎలాంటి వివాదాలు లేని అనుకూల ప్రదేశాన్ని గుర్తించి క్రిస్టియన్ భవన్ నిర్మాణం చేపట్టేలా ప్రయత్నాలు చేస్తానన్నారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని మెట్టుగూడలో గ్లోబల్ క్రిస్టియన్ లా బోర్డ్ కార్యాలయాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు.

భార్యపై భర్త కత్తితో దాడి

- అత్తగారింట్లో ఘాతుకం.. అనంతరం పోలీసులకు లొంగుబాటు

ఆత్మకూరు (ఎం), మార్చి 16 (తొలివెలుగు న్యూస్): కుటుంబ కలహాలు చినికిచినికి గాలివానలా మారి, భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన ఆత్మకూరు మండల కేంద్రంలో సోమవారం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన మహేష్‌కు, ఆత్మకూరు ఇందిరానగర్ కాలనీకి చెందిన వెంపటి దేవితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. గత కొంతకాలంగా దంపతుల మధ్య తగాదాలు జరుగుతుండటంతో దేవి తన కుమార్తెతో కలిసి తల్లి మంజుల వద్ద ఉంటోంది. సోమవారం మహేష్ అత్తగారింటికి వచ్చి, తనతో రావాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన మహేష్, తన వెంట తెచ్చుకున్న కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో దేవి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు 108 వాహనంలో బాధితురాలిని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హనుమంత తెలిపారు.

నిందితుడు మహేష్ ఫైల్ ఫోటో

విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలి

- అంకిరెడ్డిగూడెం మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్
- రుచి చూశాకే విద్యార్థులకు భోజనం వడ్డించాలి: అనురాగ్ జయంతి

చౌటుప్పల్, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా చూడాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలోని మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో, బోధనకు ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని, వంటకు ఎల్లప్పుడూ తాజాగా ఉన్న కూరగాయలనే ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు అధికారులు తప్పనిసరిగా రుచి చూసిన తర్వాతనే వడ్డించాలని ఆదేశించారు. వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని కూడా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల డార్మిటరీ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్ గదిలోని సీలింగ్ ఫ్యాన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అని అధికారులను ప్రశ్నించారు. మరుగుదొడ్లను పరిశీలించగా అవి పరిశుభ్రంగా లేవని, తలుపులు సరిగా లేవని గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తదుపరి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పరీక్షలు జరుగుతున్నందున కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పరీక్షలు రాసే సమయంలో భయాందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని చెప్పారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులకు అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ పరీక్షలు రాస్తున్న వారికి "ఆల్ ది బెస్ట్" తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- బాలింతలతో మాటామంతిడ మందుల నిల్వలు, ఓపీ రిజిస్టర్ల తనిఖీ
- చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ

చౌటుప్పల్, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది సంఖ్యపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారో వివరాలు కోరారు. ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు ఇక్కడే చికిత్స అందిస్తున్నారా లేదా ఇతర ఆసుపత్రులకు తరలిస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. ప్రతి రోజు ఓపికి ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకునేందుకు ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. గత నెలలో ఆసుపత్రిలో ఎన్ని సాధారణ ప్రసవాలు జరిగాయో కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వార్డులను సందర్శించిన కలెక్టర్ పేషెంట్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండి చికిత్సలు అందిస్తున్నారా అని రోగులను ప్రశ్నించారు. ఫార్మసీ గదిని పరిశీలించి మందుల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. గడువు ముగిసిన మందులు ఉన్నాయా అని తనిఖీ చేయాలని, రోగులకు మందులు ఇచ్చే ముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేసి ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. డెలివరీ సమయంలో వైద్యులు ఎలా సేవలు అందించారో, పుట్టిన శిశువులకు వ్యాక్సిన్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. రోగులకు రోజూ రుచికరమైన భోజనం అందుతున్నదా అని కూడా ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికుల పట్ల చేస్తున్న అన్యాయాన్ని సహించలేక ఏఐటీయూసీకి రాజీనామా చేస్తున్నారు

- ఎచ్ ఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్

మంచిర్యాల, మార్చి 16 (తొలివెలుగు న్యూస్): సింగరేణిలోని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికుల పట్ల చేస్తున్న అన్యాయాన్ని సహించలేక ఏఐటీయూసీకి రాజీనామా చేస్తున్నారని ఎచ్ ఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ తెలిపారు. హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికుల పట్ల చేస్తున్న అన్యాయాన్ని సహించలేక రాజీనామా చేసి బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోషం, వర్క్ షాప్ పిట్ కార్యదర్శి నాగేందర్ హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారిచే తమ హెచ్ఎంఎస్ లోకి చేరినట్లు తెలిపారు. ఆర్. జి -1 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆరెల్లి పోషం ను వర్క్ షాప్ పిట్ కార్యదర్శిగా నాగేందర్ ను ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, గుర్తింపు సంఘం కలా పరిమితి ఎప్పుడో ముసిందన్నారు. అయినా కూడా యాజమాన్యం కు వత్తాసు పలుకుతుందాన్నారు., డిప్యూటేషన్, క్వార్టర్స్, ప్రమోషన్ వారికి చెప్పినవారికి చేసి లబ్ధి చేస్తున్నారు, అది వెంటనే మానుకొని అన్ని సంఘాలను సమానంగా చూడాలని, వారు చెప్పినట్లుగా చేయడం మానుకోవాలన్నారు. రెఫరల్ పై హాస్పిటల్ కి వెళ్ళిన కార్మికులను కంపెనీ పూర్తి డబ్బులు చెల్లించలేదు మీరు కడితేనే డిశ్చార్జ్ చేస్తాం అని ఇబ్బంది పెడుతుంది వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణిలో నేడు గుర్తింపు, అతని విద్య సంఘాల వైఫల్యం వల్ల మెడికల్ బోర్డు ఆగిపోయిందని విమర్శించారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్గహించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఉన్న సంఘాలు పూర్తి గా వైఫల్యం చెందాయని, కార్మికుల పక్షాన కోట్లాడేందుకు తమ యూనియన్ సిద్ధంగా ఉందని ఆ సమస్య మా వద్దకు రండి జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, జనరల్ సెక్రటరీ, ఖయ్యూం, డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఆరెల్లి పోషం, వైస్ ప్రెసిడెంట్ , గాలి కిరణ్ కుమార్, ఛీఫ్ వైస్ ప్రెసిడెంట్ , పల్లె క్రాంతి కుమార్, బ్రాంచ్ సెక్రటరీ, దెబ్బెట సతీష్, జాయింట్ సెక్రటరీ, దుర్గం శ్రీనివాస్, కోశాధికారి, రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ,నాగేందర్, పిట్ కార్యదర్శి, ఏరియా వర్క్ షాప్,శ్రీధర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ, సార్ల తిరుపతి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పాల్గొన్నారు.

అనసూయ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్!?

ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వోల్ఫ్' మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన "సాసా సాసా" అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది. ఆమె ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించబోతున్నారని, ఆ రోల్ హర్రర్%-%రోమాన్స్ మిక్స్‌గా ఉంటుందని సమాచారం. అయినా, నెటిజన్లు "ఇలాంటి పాత్రలో అనసూయ ఎందుకు నటించింది?" అంటూ సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఆమెపై వ్యంగ్యంగా ట్వీట్లు చేస్తుండగా, మరికొందరు మాత్రం ఆమె కొత్త ప్రయోగాన్ని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా, "సాసా సాసా" పాటతో ఈ సినిమా మీద మళ్లీ చర్చ మొదలైంది.వినూ వెంకటేష్ దర్శకత్వంలో రూపొందిన 'వోల్ఫ్' చిత్రం ప్రభుదేవా కెరీర్‌లో 60వ సినిమాగా నిలవబోతోంది. సందేశ్ నాగరాజు, సందేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే తమిళంతో పాటు తెలుగు మరియు ఇతర భాషల్లో విడుదల కానుంది.

ఏకే 64లో లారెన్స్, విజయ్ సేతుపతి?

తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'ఏకే 64' గురించి మరో కీలక అప్డేట్ బయటకు వచ్చింది. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్నఈ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ కోసం గణనీయమైన బడ్జెట్‌ను కేటాయించినట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అజిత్‌తో పాటు మరో ఇద్దరు స్టార్ హీరోలు కూడా కీలక పాత్రల్లో నటించబోతున్నారు.వారు విజయ్ సేతుపతి,రాఘవ లారెన్స్. అయితే వీరిద్దరూ ప్రతినాయకులుగా నటిస్తున్నారా? లేక అజిత్‌కు అండగా నిలిచే శక్తివంతమైన పాత్రల్లో వస్తారా?అన్నది చిత్రయూనిట్ ఇంకా వెల్లడించలేదు. కానీ ఇండస్ట్రీ వర్గాల మాటల ప్రకారం, వీరి రోల్స్ మల్టీ-డైమెన్షనల్‌గా ఉండనున్నాయని,కేవలం ప్రతినాయక పాత్రలుగా మాత్రమే కాకుండా కథలో ప్రధాన మలుపులకు కారణమవుతారని సమాచారం. ఇటీవల 'వాలిమై', 'వీర్మా', 'తునివు', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమాలతో వరుస హిట్లు అందుకున్న అజిత్ ఈసారి మరింత స్టైలిష్, మాస్, అలాగే ఎమోషన్ కలగలిపిన పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాను ఎంచుకున్నారని తెలుస్తోంది. జనవరిలో ఈ సినిమా సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని అజిత్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ సినిమాకి దేశంలోనే అగ్రశ్రేణి టెక్నీషియన్లు, యాక్షన్ మాస్టర్లు, డీఓపీ లు కలిసి పనిచేస్తున్నట్టు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్ కోసం అజిత్ తన కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాఘవ లారెన్స్ ప్రస్తుతం 'కాంచన 4' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. పూజా హెగ్డే, నోరా ఫతేహి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే పాజిటివ్ టాక్‌ను సంపాదించుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో వరుస సినిమాలతో శరవేగంగా దూసుకెళ్తున్నారు. 'ఏకే 64' లో అజిత్, విజయ్ సేతుపతి, రాఘవ లారెన్స్ ఒకే తెరపై కనిపిస్తే.. అది కేవలం కోలీవుడ్‌కే కాదు, పాన్ ఇండియా స్థాయిలోనే అత్యంత భారీ, క్రేజీ కాంబినేషన్ గా నిలుస్తుందని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

పవన్ కళ్యాణ్‌తో 'బ్రో 2'..

పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నలే తరువాయి

పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ నటించిన 'బ్రో' సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయినప్పటికీ, దర్శకుడు సముద్రఖని 'బ్రో 2' తీయడానికి సిద్ధంగా ఉన్నానని, పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే సినిమా పట్టాలెక్కుతుందని ప్రకటించారు. ఈ వార్త పవన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. 'ఓజీ 2' వంటి భారీ ప్రాజెక్టులున్న నేపథ్యంలో 'బ్రో 2' అవసరమా అని చర్చలు మొదలయ్యాయి.పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఫాంటసీ కామెడీ సినిమా 'బ్రో'. ఇది మామా అల్లుళ్లు కలిసి నటించిన ఫస్ట్ మూవీ. 'వినోదయ సితం' అనే తమిళ సినిమాకి ఇది రీమేక్. మాతృకను డైరెక్ట్ చేసిన సముద్రఖని.. కొన్ని మార్పుల చేర్పులతో తెలుగులో తెరకెక్కించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దీనికి స్క్రీన్ ప్లే అందించారు. 2023 జులై నెలాఖరున రిలీజైన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర నిరాశ పరిచింది. పవర్ స్టార్ అభిమానులకు కూడా ఈ సినిమా నచ్చలేదు. అందుకే కలెక్షన్స్ రాలేదు. అయితే అలాంటి చిత్రానికి సీక్వెల్ చేయడానికి స్క్రిప్ట్ రెడీ అయింది.అవును.. మీరు విన్నది నిజమే. 'బ్రో 2' సినిమా చేయడానికి డైరెక్టర్ కమ్ యాక్టర్ సముద్రఖని సిద్ధంగా ఉన్నారు. తమిళంలో తీస్తారో లేదో తెలియదు కానీ.. తెలుగులో మాత్రం పవన్ కళ్యాణ్ తోనే ఈ సీక్వెల్ తీయాలని ఫిక్స్ అయిపోయారు. దీనికి కథ కూడా సిద్ధంగానే ఉంది. పవన్ ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, అప్పుడు సినిమాని పట్టాలెక్కించాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని సముద్రఖని స్వయంగా మీడియా ముఖంగా వెల్లడించారు. 'బ్రో' మూవీకి సీక్వెల్ ఉంటుందని కన్ఫామ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రలు పోషించిన 'కాంత' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. దీనికి దుల్కర్, రానా, భాగ్యశ్రీ లతో పాటు సముద్రఖని కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'బ్రో 2' మూవీ ప్రస్తావన వచ్చింది. దీనిపై సముద్రఖని స్పందిస్తూ.. "బ్రో 2' స్క్రిప్ట రెడీగా ఉంది. అన్నగారు సిగ్నల్ ఇస్తే టేకాఫ్ అవుతుంది" అని అన్నారు.బ్రో 2' సినిమా స్క్రిప్ట్ రెడీ అని సముద్రఖని ప్రకటించడంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అంతా ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. ఒకింత షాక్ అయ్యారని చెప్పాలి. ఎందుకంటే ఇది వారు ఊహించని అప్డేట్. 'బ్రో' కమర్షియల్ గా పెద్దగా వర్కౌట్ కాలేదన్నది ఓపెన్ సీక్రెట్. ఏదో పవర్ స్టార్ ఇమేజ్, స్టార్ డమ్ కారణంగా మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. కానీ కంటెంట్ పరంగా చూసుకుంటే మాత్రం సాధారణ ప్రేక్షకులతో పాటుగా అభిమానులని కూడా అంతగా మెప్పించలేకపోయింది.

తారక్ లో మార్పు సినిమా కోసమేనా?

గతకొన్ని రోజులుగా టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ అభిమానులు సోషల్ మీడియాలో చర్చల్లో మునిగిపోయారు. దానికి ప్రధాన కారణం ఆయన కొత్త లుక్! ఇటీవల తారక్ హాజరైన కొన్ని ఈవెంట్లలో ఆయన లుక్స్ వైరల్ అయ్యాయి. అందులో ఆయన చాలా సన్నగా కనిపించారు. దీనిని చూసి ఫ్యాన్స్? ఆశ్చర్యపోతూనే కొంత ఆందోళన కూడా వ్యక్తం చేశారు. చాలామంది సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో "ఎందుకు తారక్ ఇంత లీన్‌గా కనిపిస్తున్నారు?" "ఈ మార్పు సినిమా కోసమేనా?" అంటూ కామెంట్లు చేస్తున్నారు.ప్రస్తుతం తారక్ ప్రశాంత్?నీల్?తో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం లుక్ మార్చుకుంటున్నారు. ఇందులో తారక్ లుక్‌పై ప్రశాంత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా అదిరే అప్డేట్ ఇచ్చారు. తారక్ లుక్?ను దగ్గరుండి డిజైన్ చేయించుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఓ ఫొటోను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. ఇందులో ప్రశాంత్ పర్యవేక్షనలో డిజైనర్ తారక్ లుక్?ను ట్రిమ్ చేస్తున్నారు. అలాగే త్వరలోనే ఇంకో షెడ్యూల్ షురూ కానున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త పాత్రలో కనిపించనున్నారని సమాచారం. అతని స్టైలింగ్, బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ ఈ సినిమాకే పరిమితమని టీమ్ చెబుతోంది. అభిమానులు కూడా ఇప్పుడు ఈ కొత్త లుక్ వెనక దాగి ఉన్న సర్‌ప్రైజ్ ఏమిటో తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.